సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

నిర్లక్ష్యం వద్దు.. అప్రమత్తతే ముద్దు



చెత్తతో అపరిశుభ్రంగా ఉన్న పూలసందు వీధి



మంచాల వీధిలో మురుగుతో నిండిపోయిన చెత్తకుండీ

- పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ప్రమాదం
- రోగులతో కిటకిటలాడుతున్న ఆరోగ్య కేంద్రాలు
- చిన్నపాటి జాగ్రత్తలతో వ్యాధుల కట్టడి

జగదాంబ: పాతనగరంలోని పలు ప్రాంతాల్లో సీజనల్ వ్యాధుల ప్రభావం పెరుగుతోంది. ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జ్వరాలతో పాటు దగ్గు, తల, ఒంటి నొప్పులతో ప్రజలు మంచాన పడుతున్నారు. మురికివాడల్లో ఈ స్థితి దారుణంగా ఉంటుందని పలువురు వాపోతున్నారు. పలు చోట్ల ఫ్రైడే డ్రైడే, యాంటీ లార్వా ఆపరేషన్లు జరగక పోవడం వల్ల దోమలు ప్రబలి వ్యాధులు వ్యాప్తి చెందుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో ఆస్పత్రులకు రోజుకు 50 నుంచి 100 మంది వరకు రోగులు వస్తున్నారని వైద్య వర్గాలు చెబుతున్నారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం..

వర్షాకాలం నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే వ్యాధులను కట్టడి చేయగలం. ఇల్లు, ఇంటి చుట్టుపక్కల చెత్తా చెదారం లేకుండా చూసుకోవాలి. అలాగే కాలనీల్లో ఉండే చెత్త కుండీల్లోనే చెత్త వేయాలి. పనికి రాని వస్తువులను వెంటనే ఇంటింటికీ వచ్చే క్లాప్ వాహనానికి ఇచ్చేయాలి. పరిసరాలు పొడిగా ఉండేలా చూసుకోవాలి. ఇలా చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే సీజనల్ వ్యాధులను ఇట్టే కట్టడి చేయొచ్చు.

కానరాని చర్యలు...

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు ముందుగా నివారణ చర్యలు చేపట్టేవారు. దీంతో ప్రజలకు కాస్త ఉపశమనం లభించేది. అయితే ఈ ఏడాది జూలై నెల వచ్చేసినా పబ్లిక్ హెల్త్ అధికారులు చర్యలు తీసుకోకపోవడం వల్ల వ్యాధులతో జనం సతమతమవుతున్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించేవారు. ఇందులో నీళ్ల నిల్వ ఉండకూడదని, ఇంటి పరిసరాల్లో కొబ్బరి బొండాలు, పాతటైర్లు, ఫ్రిజ్ వెనుక భాగంలో నీళ్లు ఉండకూడదంటూ ఏఎన్‌ఎంలు, మలేరియా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేసేవారు. వ్యాధిగ్రస్తులు ఉంటే సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందించేవారు. కానీ ప్రస్తుతం అటువంటి కార్యక్రమాలు ఏవీ కనిపించడం లేదని పాతనగర వాసులు అంటున్నారు.



ఆస్పత్రికి రోజుకు 50 నుంచి100 మందికి పైగా రోగులు వస్తున్నట్టు చూపిస్తున్న రిజిస్టర్

జాగ్రత్తలతోనే వ్యాధుల కట్టడి

- జ్వరం దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలో ఉన్న ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలి
- వైద్యుల సలహా లేకుండా మందుల దుకాణాల వెళ్లి యాంటీ బయాటిక్ మందులు కొని వేసుకోకూడదు.
- పొల్యూషన్, ఉండే ప్రాంతాలకు దూరంగా ఉండాలి
- ఎటువంటి ఫ్లూ జ్వరం వచ్చినా వెంటనే రక్త పరీలు చేయించుకుని సంబంధిత మందులు వేసుకోవాలి.
- ఇంటింటికీ వచ్చే ఏఎన్‌ఎంల ద్వారా ఆస్పత్రులకు వచ్చి వైద్యులను సంప్రదించాలి.



ప్రసాద్‌గార్డెన్స్ ఆస్పత్రిలో జర్వంతో ఉన్న వ్యక్తికి ఇంజక్షన్ చేస్తున్న స్టాఫ్ నర్స్



ప్రసాద్‌గార్డెన్స్ ఆరోగ్య కేంద్రం

సీజనల్ వ్యాధుల కట్టడికి చర్యలు..

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సత్వర వైద్యం అందిస్తున్నాం. ప్రజలు కూడా ఆరోగ్యం విషయంలో అలసత్వం చూపకుండా దగ్గు, జ్వరం వంటివి వస్తే వెంటనే ఆస్పత్రికి వచ్చి పరీక్ష చేయించుకోవాలి. వైద్యులు ఇచ్చే మందులు వాడాలి. ఇప్పుడున్న వాతావరణ పరిస్థితిల్లో అందరు కాచి చల్లార్చిన నీటినే తాగాలి.

– డాక్టర్ సందేశ్, వైద్యాధికారి ప్రసాద్‌గార్డెన్స్ ఆరోగ్య కేంద్రం

క్లుప్తంగా

కనకమహాలక్ష్మిని దర్శించుకున్న వాసుపల్లి



అమ్మవారికి పూజలు చేస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్: సిరులతల్లి కనకమహాలక్ష్మి అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ గురువారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుసుమ హరనాథుల నామ సప్తాహం ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో కుసుమ హరనాథ దివ్యమూర్తులు

దాబాగార్డెన్స్: దువ్వాడ రాజీవ్‌నగర్‌లో కుసుమ హరనాథ నామ సప్తాహం గురువారం ప్రారంభమైంది. ముందుగా మందిరంలో దివ్య మంగళ మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి, అఖండ జ్యోతి వెలిగించి, గణపతి పూజ అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా బృందగానంతో నామ సప్తాహం ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్త బృందాలు నామ సప్తాహంలో పాల్గొని షోడ సాక్షరీ నామాన్ని మధురంగా గానం చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ సభ్యులు బీవీ బాబాజీ, ఆర్‌వీఎస్ రమేష్, ఎస్.అన్నాజీరావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, కె.మంగరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి చేయూత



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం: జ్ఞానాపురం రైల్వేస్టేషన్‌లోని భీమేశ్వర ఆటో యూనియన్ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్ణపాటి జోసెఫ్ అకాల మరణం చెందాడు. ఈ విషయం తెలుసుకున్న 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ గురువారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఎంతో ఆరోగ్యంగా ఉండే జోసెఫ్ మరణవార్త కలవరపరిచిందన్నారు. జోసెఫ్ పార్టీకి ఎంతో సేవలందించారని పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి రూ.10 వేల నగదు అందించారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వేళంగిణిరావు, కిషోర్, ఈశ్వరి, సంపంగి రత్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో ఆర్చ్, ఆర్‌వో ప్లాంట్ల ప్రారంభం



కేజీహెచ్‌లో ఆర్‌వో ప్లాంట్లలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

మహారాణిపేట: కేజీహెచ్‌లో రోగులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. గురువారం పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ముందుగా కేజీహెచ్‌లో రూ.45 లక్షలతో నిర్మించిన ప్రధాన ద్వారాన్ని ప్రారంభించామన్నారు. అనంతరం దివీస్ ల్యాబ్ తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులు రూ. కోటి 28 లక్షలతో సమకూర్చిన 12 యూనిట్లతో కూడిన 8 సురక్షిత తాగునీటి ఆర్‌వో ప్లాంట్లను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాసవీలత, టీడీపీ నియోజకవర్గం సమన్వయకర్త సీతంరాజు సుధాకర్, స్థానిక కార్పొరేటర్ కె.అప్పలరత్నం, మాజీ కార్పొరేటర్ జ్యోతి, జనసేన పార్టీ వార్డు అధ్యక్షురాలు యజ్ఞశ్రీ, టీడీపీ వార్డు అధ్యక్షుడు సీఎం రమణ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొలతల్లో తేడాల్లేకుండా చూడాలి

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



టీడీఆర్‌లకు సంబంధించి రోడ్డు విస్తరణ కొలతలు పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్



ఫుట్‌పాత్‌ల ఆక్రమణపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కమిషనర్

దాబాగార్డెన్స్: జోన్–4 పరిధి జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ వరకు విస్తరించిన రోడ్డు కొలతలను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ గురువారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. రోడ్డు విస్తరణలో ఆస్తులు కోల్పోయిన వారికి టీడీఆర్‌లు జారీ చేసే విషయంలో సంబంధిత కొలతల్లో ఎటువంటి తేడా లేకుండా చూడాలని చీఫ్ సిటీ ప్లానర్‌ను కమిషనర్ ఆదేశించారు. రోడ్డు మ్యాప్‌ను పరిశీలించి, విస్తరణలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులు ఎన్ని ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. పరిశీలనలో ముందుగా సూపర్ బజార్ వద్ద ఉన్న విశాలాంధ్ర బుక్ హౌస్ ప్రతినిధులతో వారి ఆస్తికి సంబంధించి వివరాలు అడిగి తెలుసుకుని, కొలతలు నిర్వహించి, టీడీఆర్ జారీకి సంబంధించిన పత్రాలు పరిశీలించారు. రోడ్డు విస్తరించక ముందు, విస్తరించిన తర్వాత ఎన్ని ఆస్తులు కోల్పోయారో ఆరా తీస్తూ టీడీఆర్‌లు ప్రస్తుతం జారీకి సంబంధించి ఏ స్థాయిలో ఉన్నాయని పట్టణ ప్రణాళిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. పూర్ణామార్కెట్‌లోని ప్రభాత్ థియేటర్ వద్ద, రవీంద్ర గోల్డ్ కవరింగ్ దుకాణం, ఏవీఎస్ కాలేజీ డౌన్ ఏరియా సమీపంలోని శ్రీసాయి అనంతలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ వ్యాపారులకు సంబంధించిన ఆస్తుల కొలతలు, రోడ్డు విస్తరణ కొలతలను స్వయంగా పరిశీలించిన కమిషనర్ ఆస్తులకు సంబంధించిన వివరాలు వారిని అడిగి తెలుసుకున్నారు. జీవీఎంసీ పరిధిలో టౌన్ సర్వేకు సంబంధించిన పూర్తి సమాచారంతో కూడిన రికార్డులు ఒక దస్తా కాపీని అందజేయాలని ఎస్టేట్ ఆఫీసర్ పి.సన్యాసినాయుడును కమిషనర్ ఆదేశించారు.

పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వద్దు..

అనంతరం రవీంద్ర గోల్డ్ కవరింగ్ దుకాణం ముందు ఉన్న వ్యర్థాలను గమనించారు. గత నాలుగు రోజుల నుంచి తొలగింపులో అలసత్వం వహించిన వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, అతనికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణపై సీరియస్..

పూర్ణామార్కెట్ వద్ద వైజాగ్ ట్రెండ్స్, ప్రగతి ఫుట్‌వేర్ వ్యాపారులు ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వైనం గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫుట్‌పాత్‌లు పాదచారుల సౌకర్యార్థం నిర్మించామని, వాటిని ఆక్రమించి వ్యాపారాలు జరిపితే తగిన చర్యలు చేపడతామన్నారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమించి నిర్వహిస్తున్న వ్యాపారాలను వెంటనే తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో సిటీ ప్లానర్ ధనుంజయ రెడ్డి, డీసీపీ హరిదాస్, ఏసీపీ ఝాన్సీలక్ష్మి, టౌన్ సర్వేయర్ బాలకృష్ణ, టీపీవో, వార్డు ప్లానింగ్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

దారుణదారులు



నగర రహదారులు మృత్యుకుహరాలుగా మారాయి. డాబాగార్డెన్స్ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో, న్యూకాలనీ నుంచి కంచరపాలెం వెళ్లే దారిలో రోడ్లు మరింత అధ్వానంగా తయారయ్యాయి. రోడ్లు గోతులమయంగా మారడంతో పాటు వర్షపు నీరు వాటిలో చేరడంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.

– ఫొటోలు సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

సిరులతల్లికి పంచామృతాభిషేకం



పంచామృతాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న వన్‌టౌన్ సీఐ జీడీ బాబు

మహారాణిపేట: విద్యార్థులు ర్యాగింగ్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వన్‌టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జీడీ బాబు అన్నారు. గురువారం ఆంధ్రా మెడికల్ కాలేజీలో నిర్వహించిన ర్యాగింగ్, మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జీడీ బాబు మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని చట్టంలో స్పష్టంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అనాటమీ విభాగాధిపతి (హెచ్‌వోడీ) డాక్టర్ రవీంద్ర కిషోర్, ఫిజియాలజీ విభాగాధిపతి డాక్టర్ గీతాంజలి, బయో కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ భవానీ, హాస్టల్ వార్డెన్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు మేనిఫెస్టో అంటే చెత్తబుట్ట



స్థల పరిశీలన చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

అల్లిపురం: చంద్రబాబుకు మేనిఫెస్టో కేవలం చెత్త బుట్ట అని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గం సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 5వ తేదీన నియోజకవర్గంలో జరగనున్న 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమం జరిగే స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తాను టీడీపీలో ఉన్నప్పుడు కూడా మేనిఫెస్టోలో మత్స్యకారులను ఎస్టీల్లో చేర్చాలని ఉన్న అంశంపై మాట్లాడితే అసలు మేనిఫెస్టోలో పెట్టామా అని తిరిగి చంద్రబాబు అడగడం తనకెంతో బాధ కలిగించిందన్నారు. అధికార దాహం కోసం అబద్ధాలకు వెనుకాడని చంద్రబాబు నేడు 5 కోట్ల మంది ప్రజలకు వెన్నుపోటు పొడిచారన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా రూ.81 వేల కోట్ల మేర ఆయా పథకాల లబ్ధిదారులను చంద్రబాబు మోసగించారన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, వార్డు అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, పీతల వాసు, సౌత్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఆకుల శ్యామ్, సౌత్ సోషల్ మీడియా అధ్యక్షుడు బేవర మహేష్, గుమ్మడి చంద్రమౌళి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధిలో మార్పు లేదు



డ్వాక్రా మహిళలకు సూచనలు చేస్తున్న ఎస్‌బీఐ లీడ్ మేనేజర్ శ్రీనివాస్

దాబాగార్డెన్స్: రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాలు (డ్వాక్రా) ఏర్పాటు చేసి సుమారు 30 ఏళ్లు దాటినా డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధిలో పెద్ద మార్పు రాలేదని సామాజిక కార్యకర్త కె.రమాప్రభ తెలిపారు. పొదుపు సంఘాల గ్రూపులకు ఫైనాన్స్ సంస్థల అప్పులపై అవగాహన సదస్సు గురువారం ఐద్వా ఆధ్వర్యంలో అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ లీడ్ మేనేజర్ శ్రీనివాస్, జోన్–4 యూసీడీ ఏపీడీ పద్మావతి, గ్రామీణ బ్యాంక్ మేనేజర్ అనిల్‌కుమార్, సామాజిక కార్యకర్త కె.రమాప్రభ పాల్గొని మాట్లాడారు. ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా ఎస్‌బీఐ లీడ్ మేనేజర్ శ్రీనివాస్ డ్వాక్రా మహిళలకు పలు సూచనలు చేశారు. అనంతరం రమాప్రభ మాట్లాడుతూ రాష్ట్రంలోని డ్వాక్రా గ్రూపుల్లో సుమారు కోటి మందికి పైగా మహిళలు సభ్యులుగా ఉన్నారని, చాలా తక్కువ మందిలో మాత్రమే అవగాహన ఉందన్నారు. మహిళల్లో ఆర్థిక, సామాజిక, రాజకీయ అవగాహన చైతన్యం రావాలని ఏర్పాటు చేసిన ప్రాజెక్టు లక్ష్యం నేటికీ నెరవేరలేదన్నారు. డ్వాక్రాలో అవినీతి చొరబడడం బాధాకరమన్నారు. దీనిని అరికట్టాలంటే డ్వాక్రా మహిళలు అవగాహన పెంచుకోవాలన్నారు. స్త్రీ నిధి లోన్ల నిర్వహణలో అనేక లోపాలు జరగడం వల్ల డ్వాక్రా మహిళలు ఈ పథకాన్ని ఉపయోగించుకోలేకపోతున్నారని, మైక్రో ఫైనాన్స్ సంస్థలు ఇతర ఫైనాన్స్ సంస్థలను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. జీరో వడ్డీ పూర్తిగా వచ్చిందా? లేదా? అనే ఆలోచన లేకపోవడం, బ్యాంకుల నుంచి లింకేజీ లోన్లు తీసుకునే సందర్భంలో అనేక చార్జీల పేరిట వేస్తున్న అధిక మొత్తం, బ్యాంకు వడ్డీతో పాటు ఓవర్ లోడ్‌గా ఉందన్నారు. అభయ హస్తంలో అర్హులైన వారికి పెన్షన్ రాకపోతే అడగాలనే ఆలోచన లేకపోవడం, గ్రూపుల్లో పొదుపు చేసుకుంటున్నా మన సొమ్ముతో సభ్యుల అవసరాలకు అంతర్గత అప్పులు నడుపుకోవచ్చనే ప్రాథమిక సూత్రాన్ని తెలిసిన డ్వాక్రా మహిళలు చాలా తక్కువ మంది మాత్రమే ఉన్నారన్నారు. డ్వాక్రా మహిళలు ఆర్థికంగా సాధికారత సాధించాలంటే ప్రభుత్వం ఉపాధి ట్రైనింగ్ ఇచ్చి, మార్కెట్ సౌకర్యం కల్పించాలన్నారు. సబ్సిడీ లోన్లు ఇవ్వాలన్నారు.

డిమాండ్లివీ..

పొదుపు సొమ్ము నుంచి అంతర్గత అప్పులు నడుపుకునేందుకు బ్యాంకుల నుంచి అభ్యంతరాలు చెప్పరాదని, డ్వాక్రా మహిళలను అన్ని బ్యాంకులు గౌరవించాలని, జీరో వడ్డీ ప్రభుత్వం డ్వాక్రా గ్రూపులకు పూర్తిగా వేయాలని, అభయ హస్తం పెన్షన్ అర్హులైన వాందరికీ ఇవ్వాలని, అవినీతిని అరికట్టే చర్యలు చేపట్టాలని, స్త్రీ నిధి లోపాలు లేకుండా నడపాలని, పెద్ద మొత్తంలో ప్రభుత్వం లోన్లు ఇవ్వాలని, డ్వాక్రా యానిమేటర్లు ఆర్పీలకు పూర్తి వేతనం ప్రభుత్వమే చెల్లించాలని, ఉపాధి శిక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్.వరలక్ష్మి, కె.మణి, కె.కుమారి, బి.భారతి, డి.కొండమ్మ, బొట్టా ఈశ్వరమ్మ, ఆర్.విమల, బి.మమత, కల్యాణి, జి.లక్ష్మి, కె.సంతోషం తదితరులు పాల్గొన్నారు.

8వ వేతన సంఘం కమిటీ ఏర్పాటు చేయాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

దాబాగార్డెన్స్: ఎనిమిదవ వేతన సంఘం కమిటీని తక్షణమే నియమించాలని డిమాండ్ చేస్తూ గురువారం నేవల్ డాక్‌యార్డ్ ఎంవోపీ గేట్ల వద్ద ఐఎన్‌సీ మజ్దూర్ సంఘ్ నేతృత్వంలో ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఉద్యోగులందరికీ పాత పెన్షన్ పథకాన్నే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. రక్షణ రంగ సంస్థల ప్రధాన ద్వారాల వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఐఎన్‌సీ మజ్దూర్ సంఘ్ గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు, బీపీఎంఎస్ ఫెడరేషన్ ఉప ప్రధాన కార్యదర్శి పుట్టా విద్యాసాగర్, సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.రాజేష్, గౌరవ అధ్యక్షుడు పైలా దేముడునాయుడు మాట్లాడారు. అనంతరం సమాన స్థాయిలో ఉన్న నాన్ పిటిషనర్ ఉద్యోగులకు కోర్టు తీర్పుల ద్వారా న్యాయ రక్షణ అంశాల్ని విస్తరింపజేయాలని, హెచ్‌ఆర్‌ఏపై ఓవర్ టైం అలవెన్స్ లెక్కించాలనే అంశాలతో కూడిన వినతిపత్రాన్ని తూర్పు నావికాదళం సీసీపీవోకు అందజేశారు. తమ వినతిని ప్రధాని మోదీకి పంపాలని కోరారు. నిరసనలో ఫెడరేషన్ కార్యవర్గ సభ్యుడు బి.శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు కోరుబిల్లి వెంకటనాయుడు, పి.సురేష్, అల్లిపిల్లి నరసింహరాజు, ఆడారి రమేష్, రవికుమార్, పి.రాజు, కె.వెంకటేశ్వరరావు, గోపీనాథరెడ్డి, గొన్న మహేష్, నొడగల శ్రీనివాసరావు, మోహనరావు, సాహూ, భాను, హరీష్‌బాబు, లోవరాజు, శేషు, రామకృష్ణ, బండారు శివ, కాసుబాబు, జగదీష్, చింతాడ రమణ, శ్రీనుబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజానికి కృషి



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: పోలియో రహిత సమాజానికి రోటరీ క్లబ్ నిరంతరం శ్రమిస్తుందని విశాఖపట్నం డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ వై.కల్యాణ చక్రవర్తి పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం గురువారం నిర్వహించారు. డిస్ట్రిక్ట్ గవర్నర్ నామినీ పి.శోభన్ ప్రకాష్ పాల్గొని నూతన అధ్యక్షుడు పీవీ రఘుపతి, కార్యదర్శి ఎస్.వంశీమోహన్, మాజీ అధ్యక్షుడు డి.మధుసూదనరావు, జగన్ మోహన్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలియో లేకుండా చేయాలన్నదే రోటరీ క్లబ్ ముఖ్య ఉద్దేశమన్నారు. డిస్ట్రిక్ట్ గవర్నర్ నామినీ పి.శోభన్ ప్రకాష్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ సేవలు మరింత విస్తరించేలా కృషి చేస్తామన్నారు. నూతన అధ్యక్షుడు పీవీ రఘుపతి మాట్లాడుతూ రాబోయే కాలంలో అనేక సామాజిక కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో వినయ్ గాంధీ బిల్లాపాటి, మణిమాల బోగవిల్లి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ సౌత్

9010810033, 7075989701

Office mail : sakshiadvtvsp@gmail.com